క్లుప్తంగా

ఘనంగా యాసీన్ బాబా చందనోత్సవం



చందనోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 38వ వార్డు బుక్కా వీధి సమీపాన గల దర్గాలో యాసీన్‌బాబా చందనోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు చేపట్టిన యాసిన్‌బాబా చందనోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలతో పాటు మూడు మతాల దైవాలు నియోజకవర్గంలో ఒకే చోట ఉండడం విశేషమన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ ప్రతినిధులు నవాజ్ ముస్తాఫా, షబ్బీర్, ముజీబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న జానకీరామ్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 37వ వార్డులో ఇద్దరు వలంటీర్లను నియమించారు. ఎంపికైన వలంటీర్లు చెన్నా ఉమా మహేష్, శశికళకు వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతగా పని చేసుకుంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఇంటికి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రెయ్యి డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్ : విశాఖ జిల్లా గౌడ సంఘం వార్షిక క్యాలెండర్‌ను మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శుక్రవారం తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ గౌడ సంఘం తరఫున విశాఖపట్నం, ఉత్తరాంధ్ర జిల్లాల్లో గల గౌడ కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపాయన్నారు. గౌడ సామాజిక భవనం ఏర్పాటుకు మేయర్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మేరువ గణేష్‌గౌడ్, విశాఖ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు మార్గాన రామారావు, రాష్ట్ర గౌడ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ కామాన సుబ్బారావు, ఏవీఎస్ఎన్ మూర్తి, దివి నారాయణరావు, మధుసూదన్, చలమోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా బాల నృత్య కళాకారులకు టర్కీ డిప్లొమాలు

సీతమ్మధార: టర్కీలోని ఇస్తాంబుల్‌కు చెందిన ఫోక్‌లర్ బోజాజ్‌కి సాంస్కృతిక సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ ఆన్‌లైన్ డ్యాన్స్ కాంపిటీషన్స్‌లో విశాఖ జిల్లాకు చెందిన బహుభాషా బాల నృత్య కళాకారులకు డిప్లొమాలు లభించాయి. ఇంటర్నేషనల్ డ్యాన్స్ కౌన్సిల్ గుర్తింపు పొందిన ఈ సంస్థ ప్రతి ఏడాది అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ ఫోక్ డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తోంది. గతేడాది విశాఖకు చెందిన బాహుభాషా నృత్య కళాకారిణి ఆర్.హర్షిత టీనా అత్యధిక మార్కులతో అంతర్జాతీయ నృత్య డిప్లొమాను అందుకుంది. ఈ ఏడాది డ్యూయెట్ జానపద విభాగంలో బట్టు అనురాధ(తగరపువలస), వేటూర కమలిని శ్రీవర్ష(సీతమ్మధార), సోలో సీనియర్స్ విభాగంలో గోకా డింపుల్(ఆశీలమెట్ట), మంత్రి మోక్షిత(మద్దిలపాలెం), అవార్డులు అందుకున్నారు.

సంక్రాంతి వెలుగులు



పార్టీ మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

- కార్యకర్తలతో ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి
- పార్టీ మహిళలకు చీరల పంపిణీ



వెంకటేశ్వరమెట్ట సచివాలయం వద్ద భోగి మంటలు వేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. జీవీఎంసీ 33వ వార్డు కుమ్మరవీధి, వుడ్ యార్డ్, బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట సచివాలయాల ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, గంగిరెద్దుల ఆట పాటలు, సంక్రాంతి పాటలతో సందడి చేశారు. వార్డు నాయకులు పచ్చిరిపల్లి రాము, మాదాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు గోపాల కృష్ణ, దుర్గాప్రసాద్, ఊర్వశి, కొల్లు సత్యవతి, చంద్రకళ, జ్యోతి, గంగ, సత్యవతి, అనురాధ, వలిశెట్టి లక్ష్మి, కృష్ణారెడ్డి, పులి, గురుస్వామి, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొని భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి పండగ అందరికీ భోగ భాగ్యాలు అందించాలని ఆకాంక్షించారు. ఇదే మాదిరి జగనన్న సుపరిపాలన కోసం 2024లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఘనంగా మినీ సంక్రాంతి..

మహారాణిపేట : టౌన్ హాలు రోడ్డులోని చిన్నమ్మవారి వీధిలో ఉన్న సచివాలయంలో మినీ సంక్రాంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు పరిపాలనా ,కార్యదర్శి పి.జె.గణేష్ కుమార్, వార్డు సెక్రటరీ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రేమసమాజం బాలికలు, విద్యార్థినులు



వేడుకలు నిర్వహిస్తున్న చిన్నమ్మ వారి వీధి సచివాలయ సిబ్బంది

ప్రేమసమాజంలో..

డాబాగార్డెన్స్ : ప్రేమసమాజంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రేమసమాజం కార్యదర్శి కె. హరిమోహన్‌రావు నేతృత్వంలో నిర్వహించిన పోటీలకు విశేష స్పందన వచ్చింది. ప్రేమసమాజం బాలికలు, పాఠశాల విద్యార్థినులు, కుట్టు శిక్షణ శిక్షకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు, పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రేమసమాజం ఉపాధ్యక్షుడు కె. నరసింహమూర్తి, కోశాధికారి ఎంవీవీకే గుప్త, సంయుక్త కార్యదర్శులు వీకే సురేష్‌కుమార్, వి. మోహనరావు, కార్యవర్గ సభ్యులు ఎస్. లక్ష్మి, కేకేఎం లక్ష్మి, ఎ. నాగేశ్వరరావు, ఆశ్రమవాసులు పాల్గొన్నారు.

ఆరాధ్యనీయులు.. మాస్టర్ ఈకే



హోమియో గోష్టిలో మాట్లాడుతున్న డాక్టర్ కేఎస్ శాస్త్రి

మహారాణిపేట : అనేక మందిని హోమియో వైద్యులుగా తీర్చిదిద్ది మాస్టర్ ఈకే ఆరాధ్యులయ్యారని జగద్గురుపీఠం జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.ఎస్. శాస్త్రి అన్నారు. శుక్రవారం అంకోసా హాలులో జగద్గురు పీఠం రెండవ రోజు గురుపూజోత్సవాలలో హోమియో గోష్టి నిర్వహించారు. హోమియో వైద్యులకు విజ్ఞానంతో పాటు యోగ దృష్టి కూడా ఉండాలని, మాస్టర్ ఈకే రచించిన సైన్స్ ఆఫ్ మేన్ అనే గ్రంథంలో ఇదంతా ఉందన్నారు. సంస్థ సలహా మండలి సభ్యుడు వి.వి.రామకృష్ణశాస్త్రి మాట్లాడుతూ పశువులకు కూడా తమ సంస్థ ద్వారా హోమియో సేవలు అందిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలలో మహిళలు సామూహిక లలితా సహస్ర నామ పారాయణ చేశారు. కుంకుమ పూజలో విదేశీ మహిళలు కూడా పాల్గొన్నారు. పప్పు పద్మావతి వీణ కచేరీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వైద్యులు పి.రమణ, పి.రాఘవరావు, జె. చంద్రమోహన్, విశ్రాంత చీఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ యం. నరసింహప్ప, యువీఎఎన్ రాజు, వారణాసి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్పశ్చిమ సమన్వయం ఒక యజ్ఞం

మహారాణిపేట : ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయమనేది పవిత్రమైన యజ్ఞమని జగద్గురు పీఠం భౌగోళిక కో–ఆర్డినేటర్ జర్మన్ దేశీయుడు లుడ్జర్ ఫిలిప్స్ పేర్కొన్నారు. అంకోసా ఫంక్షన్ హాలులో శుక్రవారం జగద్గురు పీఠం సోదర బృందం నిర్వహించిన ప్రాక్పశ్చిమ సభా కార్యక్రమంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. సంస్థ వ్యవస్థాపకులు మాస్టర్ ఈకే, గతంలో భౌగోళికంగా సేవలందించిన మాస్టర్ కె.పార్వతీకుమార్ వివిధ దేశాల్లో చేసిన ప్రసంగాలు, వారు రాసిన గ్రంథాల్లో ఉన్న పరమ గురువుల మార్గానికి నేడు వేలాది మంది పాశ్చాత్యులు ప్రభావితం చెందుతున్నారన్నారని లుడ్జర్ వివరించారు. సభకు అధ్యక్షత వహించిన సంస్థ భౌగోళిక నిర్వాహకులు కె. గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రాక్పశ్చిమ యజ్ఞ నిర్వహణలో భాగంగా మాస్టర్ పార్వతీకుమార్ 65 పర్యాయాలు విదేశాలలో పర్యటించారన్నారు. మాస్టర్ ఈకే రాసిన ఓవర్సీస్ మెసేజెస్ 8వ సంపుటాన్ని, అలాగే పార్వతీకుమార్ రాసిన సెవెన్ రేస్ ఆఫ్ లైట్ అనే జర్మన్ అనువాద గ్రంథాన్ని ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న లుడ్జర్

స్పెయిన్ వనిత డోనా, అర్జెంటైనాకు చెందిన రేయన్స్, సంస్థ కార్యదర్శి బీఆర్‌కే రాజు, అజ్జరపు శ్రీనివాస్, జ్యోతిషాచార్య ఎన్ఎస్ఎస్ రాము, బాలభాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్. శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లతో ఆసరా



లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం : కొత్త ఏడాదిలో కొత్త పింఛన్లతో లబ్ధిదారులకు ముందుగానే సీఎం జగనన్న సంక్రాంతి తీసుకువచ్చారని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను ఆమె భూపేష్‌నగర్ సచివాలయం పరిధిలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమానికి జగనన్న ఎల్లప్పుడు మందుంటారన్నారు. ప్రజల బాగోగులే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే జగనన్న లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ పింఛన్లు రూ.3 వేలు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లండా రమణ, దూడ అప్పారావు, సూరిబాబు, సత్తిబాబు, వెల్ఫేర్ సెక్రటరీ రెహ్మాన్ రమీజ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న జానకీరామ్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 37వ వార్డులో నిరుపేద కుటుంబానికి ఆ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ శుక్రవారం నిత్యావసర సరుకులు అందజేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఆ ఇంట వెలుగులు నింపాలని, పస్తులతో ఉండకూడదన్న ఉద్దేశంతో ఆదిలక్ష్మి అనే నిరుపేద మహిళకు బియ్యం, పప్పు, నూనె నిత్యావసర సరుకులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెయ్యి డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందునికి ఘన నివాళి



వివేకానందునికి నివాళులు అర్పిస్తున్న రమణారెడ్డి, నీలకంఠం తదితరులు

అల్లిపురం : ప్రపంచానికి ఆధ్యాత్మిక విలువలు చాటి చెప్పిన వ్యక్తి స్వామి వివేకానందుడు అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలాపు వెంకట రమణారెడ్డి అన్నారు. వివేకానందుడి జయంతి సందర్భంగా శుక్రవారం సౌత్ జైలురోడ్డులో గల వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వివేకానందుని జన్మ దినోత్సవం అయిన జనవరి 12వ తేదీన యువజన దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 33,34,35,41 వార్డుల మండలాధ్యక్షుడు కర్రి నీలకంఠం, 33వ వార్డు నాయకులు బొడ్డేటి ప్రసాద్, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, వార్డు మాజీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, భీశెట్టి రాజు, మదీనాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద మహోన్నత వ్యక్తి..

డాబాగార్డెన్స్ : పాతనగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులకు దుప్పట్లు, అంధులకు దుస్తులు, పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, సంచులు అందజేశారు. మంచి ఉద్దేశంతో సంస్థ స్థాపించి, వెనుక నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న సూరాడ సత్తియ్యమ్మను ప్రముఖులు సత్కరించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, చలమాజీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ అధినేత మట్టపల్లి హనుమంతరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ, క్రిస్టియన్ మైనార్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ పాల్గొన్నారు.



సూరాడ సత్తియ్యమ్మను సత్కరిస్తున్న ప్రముఖులు

ఏవీఎన్ కళాశాలలో..

స్థానిక ఏవీఎన్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యూత్ డే నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ విశాఖ శాఖ ప్రతినిధి గీతాస్ సరానందాజీ, డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ డిస్పాచ్ కమిషన్ సభ్యురాలు రహముస్నీషా బేగం, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, బి. సూర్యప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, పి. గాంధీ, గాయత్రి, డాక్టర్ అర్చన, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయం మార్పు

జగదాంబ : ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఉన్న 207 సచివాలయాన్ని ఉడ్‌యార్డు స్ట్రీట్‌కు మార్పు చేశారు. స్టేడియం అభివృద్ధి కోసం పనులు చేపట్టడంతో అందులో ఉన్న సచివాలయాన్ని పక్కనే ఉన్న ఉడ్‌యార్డుకు మార్పు చేశారు. కల్లుపాకలకు చెందిన వారందరు ఈ విషయాన్ని గమనించి సచివాలయ సేవలకు ఉడ్‌యార్డు స్ట్రీట్‌కు రావాలని సెక్రటరీలు తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు



శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులను అభినందిస్తున్న వీసీ సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం వలంటీర్లు జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికయ్యారు. ఈ మేరకు వారిని ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలలో భాగం కావడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. సమూహంగా పనిచేయడం, కార్యసాధక నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ప్రోగ్రాం అధికారి అనసూయ తదితరులు పాల్గొన్నారు. ఏయూ పరిధిలోని జీవీపీ కళాశాల విద్యార్థిని జి.కావ్య దేవి, డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల విద్యార్థిని ఎ.చూడామణి, ఏయూ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వి.రామరాజు, టీఎస్ఆర్–టీబీకే డిగ్రీ కళాశాల విద్యార్థి వై.విశ్వమోహన్ హైదరాబాద్‌లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొననున్నారు.

వైభవంగా కూడార్రై ఉత్సవం

- ప్రత్యేకంగా తయారు చేసిన పాయసం నివేదన



పెళ్లికూతురు అలంకరణలో గోదాదేవి అమ్మవారు

అల్లిపురం : బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 28వ రోజు కార్యక్రమంలో భాగంగా కూడార్రై ఉత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా చేపట్టారు. తెల్లవారు జామున 5 గంటల నుంచి స్వామి వారికి తిరుప్పావై 28వ పాశురం విన్నవించుకున్నారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం మండపంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, గోదాదేవి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా తయారు చేసిన కూడార్రై పాయసాన్ని 108 మట్టి కలశాలలో నివేదించారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. అనంతరం భక్తులకు అంతరాలయ దర్శనం కల్పించి పాయశంతో కూడిన కుండలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో జీవీ రమాబాయి, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, గోదాదేవి ఉత్సవ విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న అర్చకులు



గోదాదేవి అలంకరణలో ఉన్న అమ్మాయికి శ్రీవారి ప్రసాదం అందిస్తున్న అర్చకులు



కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



క్రీడాకారిణి కోనాడ శివానీని అభినందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జామియా మసీదు వద్ద, అచ్చియ్యమ్మపేటలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. జామియా మసీదు వద్ద జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన 37వ వార్డు గొల్లవీధికి చెందిన విద్యార్థిని కోనాడ శివానీ కిక్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించినందుకు అభినందించారు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వరమెట్టపై వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 14వ తేదీ భోగి సందర్భంగా జరిగే గోదా రంగనాథుల కళ్యాణానికి రావాలని ఈవో జీవీ రమాబాయి ఆహ్వాన పత్రిక అందజేశారు. అదే విధంగా ఎరుకుమాంబ ఉత్సవాలకు ఆలయ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు, చైర్మన్లు, గృహసారథులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దండి



సుందరీకరణపై అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్ : విశాఖ సాగర తీరాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో పాటు ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. ఆర్కేబీచ్ నుంచి భీమిలి బీచ్ రోడ్డు వరకు సెంట్రల్ మీడియన్, గార్డెన్లు, వర్టికల్ గార్డెన్లు, పలు రోడ్లు, ఫుట్‌పాత్‌లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖకు ఎంతో సువిశాలమైన తీర ప్రాంతం ఉందని, ఎంతో మంది సందర్శకులు, పర్యాటకులు నగరానికి వస్తారని, వారందరికీ ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు నగర సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టీ కల్చర్ దామోదరరావును ఆదేశించారు. అలాగే సెంటర్ మీడియన్‌లో ఆకర్షణీయమైన మొక్కలు దగ్గరగా వేసి నిరంతరం పర్యవేక్షించాలని, సెంటర్ మీడియన్ల వద్ద రోడ్లపై పడిన మట్టిని వెంటనే స్వీపింగ్ మెషీన్ల ద్వారా పరిశుభ్రపరచాలని ఆదేశించారు. కొన్ని చోట్ల మొక్కల నిర్వహణ సరిగ్గా లేదని, పటిష్టమైన చర్యలు చేపట్టాలని డీడీహెచ్‌ను ఆదేశించారు. గాదిరాజు ప్యాలెస్, ఇతర బీచ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వర్టికల్ గార్డెన్లను అందంగా తీర్చిదిద్దుతూ నిరంతరం పర్యవేక్షించాలని, సెంటర్ మీడియన్‌లో మొక్కలను పశువులు తినకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ ఇంజినీర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

‘రాముడి పేరుతో బీజేపీ రాజకీయం’



మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం : రాముడి పేరుతో బీజేపీ ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టి ఓట్లు పొందేందుకు కుట్ర చేస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయని బీజేపీపై రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఇండియా కూటమిని కాదని కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. ఫలితాల్లో ఎదురుదెబ్బ తగలడంతో కాంగ్రెస్ వైఖరిలో మార్పు వచ్చిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. గోదారంగనాథుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు రాజాస్వామి

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో శుక్రవారం ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో శ్రీగోదారంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణమూర్తులకు సారె, నూతన వస్త్రాలు సమర్పించారు. ఉదయం 4 గంటలకు స్వామికి అభిషేకం, అలంకరణ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సభ్యులు ఝాన్సీ, సిబ్బంది వనజాక్షి, శివ పాల్గొన్నారు.